
సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 5 । మే । 2023



కళల కాణాచి

కళలకు కాణాచిగా విరాజిల్లుతోంది యర్రగొండపాలెం మండలం మిల్లంపల్లిలోని వేణుగోపాల స్వామి ఆలయం. 1440 సంవత్సరంలో ఈ ఆలయం నిర్మించారు. - 8లో..



పొర్లిన వాగులు, వంకలు

వెలిగండ్ల మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఎటువంటి పంటనష్టం జరగలేదు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35 /26

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు బాలినేని రాక



ఒంగోలు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉదయం 7.15 గంటలకు సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు చేరుకుంటారు. 10.30 గంటలకు స్థానిక కేశవస్వామిపేటలో సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు లాయరుపేట రైతు బజార్ వద్ద గాస్ టీ హోటల్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు మారుతీనగర్‌లో పోలీసు ఉద్యోగ సంఘ నాయకులు నర్రా వెంకటరెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు 5వ డివిజన్ గోపాలనగరం 2వ లైను ఎక్స్‌టెన్షన్‌లో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

హాకీ మహిళల జట్టు రాష్ట్ర మేనేజర్‌గా రవి



చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు హాకీ కోచ్‌గా పనిచేస్తున్న టీ.రవి ఆంధ్రప్రదేశ్ తరఫున జాతీయ స్థాయిలో హాకీ మహిళల జట్టుకు మేనేజర్‌గా నియమితులయ్యారు. ఈనెల 4 నుంచి 14వ తేదీ వరకు ఒడిశాలోని రూర్కెలాలో 13వ హాకీ ఇండియా సబ్ జూనియర్ మహిళల టోర్నమెంట్ జరుగుతున్నట్లు రవి తెలిపారు. రాష్ట్రం తరఫున పాల్గొనే జట్టుకు తనను మేనేజర్‌గా ప్రభుత్వం నియమించటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు



మాట్లాడుతున్న డీఈఓ రమేష్

త్రిపురాంతకం: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని డీఈఓ పి.రమేష్ తెలిపారు. స్థానిక కేజీబీవీలో ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేజీబీవీలకు నాలుగు ప్రత్యేక కేంద్రాలు, మోడల్ స్కూల్స్‌కు, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్‌కు ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. నాడు–నేడు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జీవీకే కిట్లు అందించినట్లు పేర్కొన్నారు. మండలాలకు పుస్తకాలు అందించామని డీఈఓ వివరించారు. అనంతరం స్థానిక ఎమ్మార్సీని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈయన వెంట ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్, జెడ్పీ ప్రధానోపాధ్యాయుడు టి.రాజశేఖరరెడ్డి, పాపారావు, ఎస్ఎస్ఏ ఏఈ మహేష్, ప్రత్యేకాధికారి మారుతీదేవి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఆదినారాయణరెడ్డి, సీఆర్‌పీలు కొండలు, శ్యామ్ ఉన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లపై నిర్లక్ష్యం తగదు

- ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



రికార్డులు తనిఖీ చేస్తున్న పద్మావతి

టంగుటూరు: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఆలకూరపాడు 1, 2, పుల్లారెడ్డిపాలెం–1, మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్–3, అరుంధతి నగర్–1, వాణీ నగర్ 1, 2, బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా లేవని, మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించడం లేదని, అంగన్‌వాడీ సెంటర్లలో కనీస వసతులు లేవని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లోపించిందని సీడీపీవో, సూపర్‌వైజర్లు ఏం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సెంటర్లలో గుడ్లు వండటం లేదని, కొన్ని సెంటర్లలో భోజనం వండటం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తుంటే ఇక్కడి అధికారులు మాత్రం నిర్లక్ష్యంతో బలహీనపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ల పనితీరు పై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఆమె వెంట న్యాయసేవా సహాయకులు పీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వేసవి సెలవుల్లో సరదాగా ఎక్కడికైనా టూర్లకు వెళ్లాలనుకుంటున్నారా.. రోజుల తరబడి ఇంట్లో ఎవరూ లేకుంటే దొంగలు పడతారేమోనని భయపడాల్సిన పనిలేదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పోలీసు శాఖ మీ ఇంటికి ప్రత్యేక కాపలా ఏర్పాటు చేస్తుంది. మళ్లీ మీరు తిరిగొచ్చేదాకా గట్టి నిఘా ఉంచుతుంది. అగంతకులు ఎవరైనా చొరబడితే వెంటనే అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకునేలా చర్యలు తీసుకుంటుంది. ఇంకెందుకు ఆలస్యం ఈ లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)లో నమోదు చేసుకుని నిశ్చింతగా ఊరెళ్లిరండి..



నిఘా నేత్రం..

ఇళ్లు భద్రం



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో జిల్లాలో రిజిస్టర్ చేసుకున్నవారు: 17,488 మంది

పోలీస్ వాచ్ రిక్వెస్ట్ పెట్టుకున్న వారు: 475 మంది



- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకోండి
- నయా పైసా ఖర్చు లేకుండా పోలీసు సేవలు
- దొంగతనాలు జరగకుండా సాంకేతిక కాపలా
- సద్వినియోగం చేసుకోవాలన్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: వేసవి సెలవులు మొదలయ్యాయి. సుమారు 40 రోజుల పాటు పిల్లలకు సెలవులు రావడంతో ఇంటికి తాళం వేసి కొందరు ఊర్లకు వెళుతున్నారు. ఇదే అదనుగా దొంగలు రెచ్చిపోవడం తరచుగా జరుగుతోంది. రోజుల తరబడి తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రతి వేసవిలో దొంగల బెడద పెరుగుతుంది. పోలీసులు గస్తీ కాస్తున్నా వారి కళ్లు గప్పి చోరీలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇలాంటి సమస్యకు పరిష్కారమే ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం). ఆధునిక సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఈ యాప్ దొంగతనాలను అరికట్టడంలో ఎంతో ఉపకరిస్తుంది. ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లకు వేయి కళ్లతో కాపలా కాస్తుంది. సెల్‌ఫోన్ వినియోగదారులు ఈ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పోలీసు శాఖ సూచిస్తోంది. కనీసం వేసవి సెలవులకు ఊర్లకు, టూర్లకు వెళ్లే వాళ్లు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే నిశ్చింతగా ఉండవచ్చని చెబుతున్నారు.

ఎంత మంది డౌన్‌లోడ్ చేసుకున్నారంటే...

ప్రకాశం జిల్లాలో 2017 జూన్‌లో ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే ఈ యాప్ ద్వారా పోలీసుల సేవలను అనేక మంది పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 17,488 మంది రిజిస్టర్ చేసుకున్నారు. వీరిలో 475 మంది పోలీస్ వాచ్ రిక్వెస్ట్ పెట్టుకున్నారు. ఒంగోలు నగరంలో ఇప్పటి వరకు 9,623 మంది రిజిస్టర్ చేసుకున్నారు. వీరిలో 340 మంది పోలీస్ వాచ్ అడిగారు. వారిలో 263 మంది వాచింగ్ ను సద్వినియోగం చేసుకున్నారు.




ఓ ఇంటిలో సీసీ కెమెరా అమరుస్తున్న పోలీసు (ఫైల్)

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏం చేస్తుంది...

ఇది తాళం వేసిన ఇళ్లకు కాపలా కాస్తుందని చెప్పవచ్చు. దీనికి మనం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక్క పైసా ఖర్చు చేయకుండానే మన ఇంటిపై పోలీసులు నిఘా పెడతారు. గుర్తు తెలియని వ్యక్తులు కానీ, దొంగలు కానీ ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తే సెన్సర్ ద్వారా వారి ఫొటోలను తీస్తుంది. ఆఘమేఘాల మీద పోలీసు కంట్రోలు రూంకు, స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బందికి అలారం ద్వారా సమాచారం ఇస్తుంది. పోలీసులను అప్రమత్తం చేస్తుంది. దీంతో నిముషాల్లో పోలీసులు అక్కడికి చేరుకుంటారు. దొంగల చేతికి బేడీలు వేసి మన ఇంట్లో దొంగతనం జరగకుండా కాపాడుతారు. ఇంట్లో విలువైన వస్తువులు పోకుండా రక్షణ లభిస్తుంది.

పోలీసులు నిఘా షురూ...

ఎప్పుడైతే ఈ యాప్‌లో పోలీసు వాచ్ అని రిక్వెస్ట్ పెట్టామో వెంటనే పోలీసులకు సమాచారం వెళుతుంది. కంట్రోలు రూం పోలీసులు, స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బంది రంగంలోకి దిగుతారు. రిక్వెస్ట్ పెట్టిన ఇంటి మీద వైఫై రూటర్ తో పాటుగా సెన్సర్‌తో పనిచేసే కెమెరాలను అమరుస్తారు. ఒకవేళ విద్యుత్ అంతరాయం కలిగినా సరే ఈ పరికరాలు సమర్థవంతంగా పనిచేసేందుకు యూపీఎస్‌ను ఏర్పాటు చేస్తారు. దీన్ని పోలీసు కంట్రోలు రూంతో అనుసంధానం చేస్తారు. ఈ యాప్ ద్వారా సాంకేతికంగా పోలీసుల నిఘా కొనసాగుతుంది.



ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి...

గూగుల్ ప్లే స్టోర్ లోకి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీసు అని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో మన ఫోన్ నంబరు, ఇంటి చిరునామాను రిజిస్టర్ చేసుకోవాలి. అప్పుడు మనకు ఒక ఐడీ కేటాయిస్తారు. దీన్ని జాగ్రత్తగా భద్ర పరుచుకోవాలి. ఎప్పుడైనా కొన్ని రోజుల పాటు ఊర్లకు వెళ్లాలనుకున్నప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లాలి. యూజర్ ఐడీని నమోదు చేసుకోవాలి. మనం ఊరికి వెళ్లే రోజు, తిరిగి వచ్చే రోజును ఎంటర్ చేయాలి. రిక్వెస్ట్ పోలీస్ వాచ్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. అంతే...

సద్వినియోగం చేసుకోవాలి



వేసవిలో ఊళ్లకు వెళ్లే వాళ్లు ఈ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవడం మంచిది. తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగలు పడకుండా ఇది రక్షణ కల్పిస్తుంది. అలాగే తమ వద్ద ఉన్న వెండి వస్తువులు, బంగారు నగలు, నగదును ప్రజలు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. వీలైనంత మేరకు వాటిని ఇళ్లలో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో ఉంచడం మంచిది.

– మలికా గర్గ్, ఎస్పీ

చాలా ఉపయోగపడింది



మేము రాజీవ్ నగర్‌లో ఉండే వాళ్లం. నేను గ్రానైట్స్‌లో పనిచేసి ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్నాను. కుటుంబ సమేతంగా మేము తరచుగా యాత్రలకు వెళుతుంటాం. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను రెండు మూడు సార్లు వినియోగించుకున్నాం. మేము ఊరికి వెళ్లి తిరిగి వచ్చే వరకు పోలీసులు తరచుగా మా ఇంటివైపు గస్తీకి వచ్చి పోతుండేవారని ఇరుగు పొరుగు చెప్పారు. ఈ యాప్ ద్వారా పోలీసులు అందించిన సేవలు ఎన్నటికీ మరిచిపోలేను. మాకు తెలిసిన వారు ఎవరైనా ఊరికి వెళుతున్నారంటే వారికి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ గురించి చెబుతుంటాను.

– గుంటూరు మారుతీ కుమార్, రాజీవ్ నగర్, ఒంగోలు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా, పక్కన రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ ప్రకాష్ యాదవ్

కనిగిరి రూరల్: సహకార సమాఖ్య రుణాలను సద్వినియోగం చేసుకుని గొర్రెలు, మేకల పెంపకదారులు అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో గురువారం సహకార సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ ఫెడరేషన్ ద్వారా అమలు జరిగే అన్ని పథకాలను పెంపకందారులు ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి గ్రామంలో మూగ జీవాలకు నీటి కుంటలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నెలలోపు కనిగిరి షీప్ యార్డ్ (గొర్రెల మండి) ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సీడీసీ ద్వారా రాష్ట్రంలోని గొర్రెల, మేకల పెంపకందారుల సమాఖ్యలకు సబ్సిడీపై రూ.88 కోట్ల రుణాలు రెండో విడత మంజూరైనట్లు రాష్ట్ర గొర్రెల మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ జి.ప్రకాష్ యాదవ్ అన్నారు. సొసైటీ సభ్యులకు రూ.22 కోట్లు సబ్సిడీ, రూ.66 కోట్లు రుణం కింద మంజూరైనట్లు చెప్పారు. యూనిట్ విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. రుణం పొందిన వారికి 20 శాతం సబ్సిడీ, 3 శాతం వడ్డీపై ఇస్తారన్నారు. అలాగే ఫెడరేషన్ స్కీంలలో 6.7 శాతం వడ్డీపై రుణాలు ఇస్తారని వివరించారు. జిల్లాలో 16 వేల మంది సభ్యులుండగా, కనిగిరి నియోజకవర్గంలోనే 4 వేల మంది ఉన్నట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 442 గొర్రెల, మేకల పెంపకదారుల సమాఖ్యలు ఉండగా, ఒక్క కనిగిరి నియోజకవర్గంలోనే 123 సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణ, ఏడీ డాక్టర్ వెంకట్రామిరెడ్డి, డాక్టర్ ఎస్.భరత్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ నారాయణ, కమ్మనేతి వెంకటేశ్వర్లు, జిల్లా సహకార సమాఖ్య మాజీ చైర్మన్ చల్లా రాఘవులు, మాజీ డైరెక్టర్ దేవర వెంకటేశ్వర్లు, గంగరాజు యాదవ్, నాలీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను గురువారం చీమకుర్తిలోని వారి నివాసంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. రెండు రోజుల క్రితం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విన్నవించుకున్న వివరాలతో పాటు సీఎంతో చర్చించిన అంశాలను వెంకాయమ్మకు వివరించారు.

సంతనూతలపాడులో క్రికెట్ క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే:

సంతనూతలపాడులో ప్రకాశం ప్రీమియర్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను గురువారం ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కలిసి అభినందించారు. నాలుగు రోజుల నుంచి ప్రకాశం ప్రీమియర్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించి పోటీల్లో రాణించాలని ప్రోత్సహించారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి

- బాపుడాకు అన్ని హంగులు తెస్తాం
- మంత్రి మేరుగు నాగార్జున

బాపట్ల: జిల్లాను అన్నిరంగాల్లో ముందుకు తీసుకుపోయేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ ఆథార్టీ చైర్మన్‌గా దేవినేని మల్లిఖార్జునరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. తొలుత నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చైర్మన్‌గా దేవినేని మల్లిఖార్జునరావు, వైస్‌చైర్మన్‌గా ఎ.భానుప్రతాప్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ బాపట్ల జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో కరోనా వంటి గడ్డుకాలంలో కూడా పాలననే గాడి తప్పకుండా పరిపాలించిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల ఖజానాను అప్పగించినప్పటికీ సమర్థవంతంగా ఒక పక్కన సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి చేసి చూపిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనకే పట్టంకట్టాలని మేరుగ సూచించారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా, పరిశ్రమలు, వాణిజ్యపంట, మైనింగ్ వంటివి పుష్కలంగా ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని అభివృద్ధి చేసుకుందామని సూచించారు.

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్లను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చేపడుతున్న కార్యక్రమాలు ఎప్పటికీ మరిచిపోమన్నారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ చీరాల ప్రాంతాన్ని కూడా బాపుడాలో కలిపి అభివృద్ధి చేయాలని సూచించారు.

బాపుడాను అభివృద్ధి చేస్తా

బాపట్ల అర్బన్ డవల్‌మెంట్ ఆథార్టీని శక్తివంచన లేకుండా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దేవినేని మల్లిఖార్జునరావు చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా బాపుడా సేవలు విస్తృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, నాయకులు రామనాథం బాబు, మోపిదేవి రాజు, డాక్టరు మేరుగు చంద్రన్న, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున



బాధ్యతలు స్వీకరిస్తున్న బాపుడా చైర్మన్ దేవినేని

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

మద్దిపాడు: పృథులగిరిపై వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం మారుతిచార్యులు.. స్వాములవారికి పంచామృత స్నాపన, తిరుమంజనం, 108 వెండి పూలతో అష్టదళ పాద పద్మారాధన పూజ నిర్వహించి ఆ జలాలను భక్తులపై చల్లారు. పీ వెంకట కృష్ణమూర్తి, ఝాన్సీలక్ష్మి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈఓ శ్రీనివాసరావు, కాటూరి ప్రసాదు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పేర్కొన్నారు. పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి కొండపై వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గురువారం ప్రారంభించారు. స్వాములవారి దర్శనార్థం సత్రాల సముదాయం నుంచి లక్ష్మీనృసింహస్వామి గర్భగుడి వరకు దాతల సహకారంతో తారురోడ్డు నిర్మాణానికి ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ కుప్పం కొల్లారావు శంకుస్థాపన చేశారు. అలాగే నూతన త్రీఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్ఈ కె.సత్యన్నారాయణ ప్రారంభించారు. దాత తాటికొండ వెంకటసుబ్బారావు, శేషమ్మ దంపతుల సహకారంతో నిర్మించిన కేశఖండన మండపాన్ని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి ప్రారంభించారు. మద్దిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ కుప్పం కొల్లారావు, సిద్దా సూర్యప్రకాష్, ఈఓ శ్రీనివాసరావు, సిద్దా నాగేశ్వరరావు, రావూరి జనార్దన్, సుబ్రహ్మణ్యం, అలపాటి శ్రీరాం, బి.మధు, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, చలువాది బదిరీ నారాయణ, వాయిగల్ల రామారావు, బోద రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, కాటూరి ప్రసాద్ పాల్గొన్నారు.



కేశఖండన మండపాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మారం వెంకారెడ్డి

క్లుప్తంగా

న్యాయవాదుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో అర్హత కలిగిన న్యాయవాదుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మార్చి 27వ తేదీ ఇచ్చిన నోటిఫికేషన్ అనుసరించి తగిన రీతిలో సంస్థ నిర్దేశించిన విధంగా నిర్ణీత పద్ధతలో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించకపోవడం వల్ల మరలా రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రకటన విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన దరఖాస్తుదారులు సొంత కేసులు గానీ , ఏ ఇతర రిటైనర్‌షిప్ తీసుకోవడానికి అనుమతి ఉండదన్నారు. ఈ ఎంగేజ్‌మెంట్ స్కీముకు సంబంధించిన వివరాలను రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ హెచ్‌టీటీపీ//ఏఎల్ఎస్ఓఎస్ఏ.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ నుంచి లేదా జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి పొందవచ్చన్నారు. సక్రమంగా పూర్తి చేసిన దరఖాస్తుఫారంతో పాటు స్వీయ ధృవీకరణతో సంబంధిత నకళ్ల పత్రాలను చైర్‌పర్సన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ , ప్రకాశం జిల్లా , ఒంగోలు వారికి సమర్పించాలన్నారు. దరఖాస్తులను అభ్యర్థులు స్పీడ్ పోస్టు లేదా వ్యక్తిగతంగా కార్యదర్శి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుల మీద ఎటువంటి క్రిమినల్ కేసులు నమోదై ఉండరాదన్నారు. గడువు తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి స్పష్టం చేశారు.

కళల కాణాచి..

శిల్ప కళా సౌందర్యానికి నిలయం మిల్లంపల్లి వేణుగోపాలస్వామి ఆలయం

- అతి ప్రాచీన దేవాలయాల్లో ఇదొకటి
- స్వామివారికి తప్పని గునపపు పోట్లు
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

యర్రగొండపాలెం: శిల్ప కళా వైభవానికి మిల్లంపల్లి వేణుగోపాలస్వామి ఆలయం ఆలవాలంగా నిలుస్తోంది. యర్రగొండపాలేనికి రెండు కిలోమీటర్ల దూరంలో కొలువై ఉన్న గోపాలుని ఆలయం అతి ప్రాచీన దేవాలయాల్లో ఒకటిగా ప్రాచుర్యంలో ఉంది. పూర్వం ఇక్కడ మిల్లంపల్లి రెవెన్యూ గ్రామం ఉండేది. కాలక్రమంలో ఈ గ్రామం కాలగర్భంలో కలిసిపోయింది. అయినప్పటికీ కొన్ని మజరా గ్రామాలు, గిరిజన తండాలు కలుపుకొని మిల్లంపల్లి పంచాయతీగా కొనసాగుతోంది.


వేణుగోపాలస్వామి దేవాలయం

అతిప్రాచీన ఆలయం

శ్రీరుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయం 1440వ సంవత్సరంలో నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. మిల్లంపల్లిలో పాలుఅమ్ముకొని జీవించే అప్పాలమ్మ అనే భక్తురాలు తన సొంత ఖర్చులతో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు నానుడి. నిర్మాణ సమయంలో భక్తురాలి ఆస్తులు పూర్తిగా హరించుకొనిపోవడంవలన గోపుర నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టలేకపోయారని ఈ ప్రాంత భక్తులు చెబుతుంటారు. ఈ ఆలయ గోపురం పైకప్పు నేటికీ ఖాళీగా కనిపిస్తోంది.


రుక్మిణీ, సత్యభామల నడుమ వేణుగోపాలస్వామి

అద్భుత శిల్ప సంపద

ఆలయ ముఖద్వారం నుంచే అద్భుతమైన శిల్పకళ భక్తులను అబ్బురపరుస్తుంది. ప్రారంభంలోనే ఆంజనేయస్వామి దర్శనమిస్తారు. అక్కడి నుంచి ముఖద్వారం వద్ద ఇరువైపులా అపురూపమైన శిల్పాలు ఆహ్వానం పలుకుతున్నట్లు కనిపిస్తాయి. ముఖద్వారం(గాలిగోపురం) పూర్తిగా శిల్పాలతో చెక్కారు. ముఖద్వారం కుడివైపు రాతిపై చెక్కిన రుక్మిణీ వేణుగోపాలస్వామి, ఎడమవైపు రుక్మిణీ, సత్యభామల నడుమ వేణుగోపాలస్వామి దర్శనమిస్తారు. లోపలి భాగంలో వివిధ భంగిమల్లో ఉన్న శిల్పాలు కనువిందు చేస్తాయి.


ఆలయ ముఖద్వారంపై శిల్ప సోయగం

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

ఆలయం ఊరివెలుపల ఉన్నప్పటికీ భక్తులను ఆధ్యాత్మికతలో ఓలలాడిస్తోంది. అంతేనా.. ఆహ్లాదాన్ని కూడా పంచుతోంది. మొక్కుబడి తీర్చుకోవటానికి వెళ్లిన భక్తులకు అక్కడే ప్రశాంతంగా ఉండిపోదామన్న ఆలోచనను ఆలయ ప్రాంగణం కలిగిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

స్వామివారికి తప్పని గునపపు పోట్లు!

వేణుగోపాలస్వామివారికి గునపపు పోట్లు తప్పడం లేదు. ఆలయంలో గుప్తనిధులు ఉన్నాయని పూర్వ కాలం నుంచి దుండగులు తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. ఆలయంలో స్వామి లేకుంటే భక్తులు పూజలు చేసుకోవటానికి రారన్న ఉద్దేశంతో మూలవిరాట్ విగ్రహాన్ని రెండు పర్యాయాలు పెకిలించి వేశారు. ధ్వజస్తంభాన్ని కూల్చారు. 2014లో హైదరాబాద్‌కు చెందిన లేడీ గ్యాంగ్‌లీడర్ ఆధ్వర్యంలో 10 మంది ఆలయంలో తవ్వకాలు జరుపుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. 2015లో ముఖద్వారం కుడివైపు 12 అడుగుల మేర సొరంగాన్ని తవ్వారు. ఈ విధంగా స్వామి వారి ఆలయంలో దాదాపు 20 పర్యాయాలు దుండగులు తవ్వకాలు జరిపారని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ యక్కలి భాగ్యరావు వెల్లడించారు.


ఆలయ ముఖద్వారానికి ఇరువైపులా చెక్కిన అద్భుతమైన శిల్పాలు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమినాడు వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. శుక్రవారం సాయంత్రం అంకురార్పణం, ధ్వజారోహణం, రాత్రి భేరి పూజ, దేవతాహ్వానం, రాయభారం, ఎదురుకోల, తెల్లవారు జామున రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం, 6న పగలు సూర్యవాహనం, రాత్రి సింహ వాహనం, 7న పగలు చంద్రవాహనం, రాత్రి శేషవాహనం, 8న రాత్రి హనుమంత వాహనం, 9న రాత్రి గరుడ వాహనం, 10వ తేదీ రాత్రి గజ వాహనం, 11న సాయంత్రం రథోత్సవం, 12న రాత్రి అశ్వ వాహనం, 13తేదీ పగలు పూర్ణాహుతి, చక్రస్థానం, రాత్రి హంస వాహనం కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళ మృతి

ముండ్లమూరు: సొంత పొలంలో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికొస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పిన ఘటనలో ఓ మహిళ మృత్యువాత పడింది. ఈ సంఘటన ముండ్లమూరు మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామ సమీపంలో ఈదర వాగులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన చావా వెంకటేశ్వర్లు భార్య హైమవతి(44), తల్లి ద్రాక్షాయమ్మతో కలిసి ట్రాక్టర్‌పై పొలానికి వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఈదర వాగులో ఎగమోరు ఎక్కుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. హైమవతి అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటేశ్వర్లు, ద్రాక్షాయమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరూ వినుకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

పొర్లిన వాగులు, వంకలు

వెలిగండ్ల: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బుధవారం రాత్రి 79.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వెలిగండ్లలోని ఇందిరాకాలనీలోకి వర్షం నీరు వచ్చి చేరింది. కాలనీ పక్కనే ఉన్న వాగు పొంగిపొర్లింది. బీసీకాలనీ నుంచి ఎస్సీకాలనీ వరకు ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించింది. ఎక్కడా పంటనష్టం వాటిల్లలేదు.


వెలిగండ్ల ఇందిరాకాలనీ పక్కనే పొంగిపొర్లుతున్న వాగు

సకాలంలో అర్జీలు పరిష్కరించకుంటే చర్యలు

= ఆర్డీఓ అజయ్‌కుమార్ హెచ్చరిక

కురిచేడు: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించకుంటే చర్యలు తప్పవని కనిగిరి ఆర్డీఓ తోట అజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కంభంపాటి దేవసహాయం తన భూమిని ఆన్‌లైన్ చేయటం లేదని చేసిన నిరసనను దృష్టిలో ఉంచుకుని ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలంలో రికార్డులు పరిశీలించి లోపభూయిష్టంగా ఉన్నాయని, రికార్డులు మొత్తం సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. వారసత్వంగా వచ్చిన భూమికి ఆన్‌లైన్ ఎందుకు చేయడం లేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. అర్జీలు ఇచ్చే వారిపై స్నేహంగా మెలగాలని సూచించారు. కంభంపాటి దేవసహాయం భూమిని సర్వే చేయించారు. అతనికి వెంటనే కొత్త పట్టాదారుపాస్ పుస్తకం తెప్పించాలని, ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. సర్వే నంబర్ 1,8 లపై నెల రోజుల్లో గ్రౌండ్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. మండలంలోని పడమరకాశీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని జగన్నాథపురం బేచరాకు గ్రామం పరిధిలోని బౌద్ధక్షేత్రం 77 సర్వే నంబరులో ఉందని రికార్డుల ప్రకారం పరిశీలించారు. సమగ్ర భూసర్వేలో ఆ సర్వే నంబర్ వరకు విడగొట్టి రికార్డులు స్పష్టంగా నమోదు చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా, సమగ్ర భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ శేషగిరి, వీఆర్వోలు పాల్గొన్నారు.


బాధిత రైతుతో మాట్లాడుతున్న ఆర్డీఓ

శరవేగంగా పంట నష్టం అంచనా

- రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం
- 73 గ్రామాల పరిధిలో పంటలకు నష్టం
- 993 హెక్టార్లలో దెబ్బతిన్న మొక్కజొన్న
- తడిసిన 30,410 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, జొన్న ధాన్యం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించే కార్యక్రమానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన శ్రీకారం చుట్టింది. వర్షం వలన తడిసిన పంటల వివరాలను వెనువెంటనే నివేదించాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో అధికారులు వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పర్యటించి రెండు రోజుల్లోనే పంట నష్టం వివరాలను సేకరించారు. గురువారం సాయంత్రం నాటికి పూర్తి స్థాయిలో వివరాలను సేకరించిన అధికారులు పంట నష్టం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. జిల్లా వ్యవసాయధికారితో సహా మిగిలిన అధికారులు పంట నష్టం అంచనాల్లో పాల్గొన్నారు. వర్షం వలన తడిసిన పంటలను పరిశీలించడంతో పాటు వాటిని ఆరబెట్టుకునే విషయంలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలతో కలిసి సూచనలిచ్చారు.


మొక్కజొన్న విత్తనాలను శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న అధికారులు

73 గ్రామాల్లో పంటలకు నష్టం..

గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు జిల్లాలోని జే.పంగులూరు, చుండూరు, కొల్లూరు, వేమూరు, అమృతలూరు, బల్లికురువ, పర్చూరు, నగరం, చెరుకుపల్లి, భట్టిప్రోలు మండలాల పరిధిలో 73 గ్రామాల్లో పంటలు వానకు తడిచాయి. కోత దశలో ఉన్న 993 హెక్టార్లు పరిధిలోని మొక్కజొన్న పంట దెబ్బతింది. కోత దశ పూర్తయిన తర్వాత మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, వరి తదితర పంటలకు సంబంధించిన ధాన్యం వాన నీటిలో మునిగిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జే.పంగులూరు, చుండూరు మండలాలలోని 22 గ్రామాల్లో పంట దశలోనే మొక్కజొన్న పంట నష్టం వాటిల్లింది.

తడిసిన 30,410 టన్నుల ధాన్యం..

జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, వరి పంటలు తడిచాయి. చుండూరు మండలంలో 1185 టన్నులు, కొల్లూరు మండలంలో 7460, వేమూరు 7695, అమృతలూరులో 630, చెరుకుపల్లిలో 1692, భట్టిప్రోలు మండలంలో 4500 మెట్రిక్ టన్నులు చొప్పున మొత్తం 28,957 టన్నుల మొక్కజొన్న గింజలు ఆరబోత దశలో కల్లాల్లోనే తడిచాయి. కొల్లూరు మండలంలో 185, అమృతలూరు 680 టన్నులు చొప్పున 865 టన్నుల జొన్నలు వర్షం నీటిలో తడిశాయి. ఇవే కాకుండా చెరుకుపల్లిలో 570 టన్నుల వేరుశనగ వర్షానికి తడవగా 78 టన్నుల వరి ధాన్యం వర్షార్పణం అయింది. మొత్తం 73 గ్రామాల్లో 30140 టన్నుల పంటలు తడిచి పనిరాకుండా పోయింది.

ఇంతటితో వర్షాలు తగ్గితే...

మరో రెండు మూడు రోజులు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్తోంది. ఇదే జరిగితే ఇప్పటికే వర్షంతో తడిచిన పంటలు పూర్తిగా పనికిరాకుండా పోయే పరిస్థితి ఉంది. దీంతో నష్టం పెరిగే అవకాశం ఉంది. ఇంతటితో వర్షాలు తగ్గితే తడిచిన మొక్కజొన్న, జొన్న గింజలను ఆరబెట్టుకునే అవకాశం ఉంది. ఆరబెట్టిన మొక్కజొన్న గింజలపై లీటరు నీటిలో 50 గ్రాములు చొప్పున ఉప్పు కలిపి నీటిని పిచికారి చేస్తే గింజలు మొలకెత్తకుండా ఉండడంతో పాటు బూజు పట్టకుండా, రంగు మారకుండా ఉంటాయి.


తడిసిన మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న అధికారులు

రైతులకు అండగా ప్రభుత్వం..

వాన నీటిలో తడిచిన మొక్కజొన్న జొన్న ఇతర పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకునేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వర్షాలు తగ్గగానే పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించడంతో పాటు దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేయాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరనున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే.

రైతులకు త్వరలో నష్టపరిహారం..

వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందించనుంది. పంటలు నష్టపోయిన రైతులకు గతంలో పలు మార్లు నష్టపరిహారం అందించింది. గత మార్చిలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి 1.50 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. అది కూడా ప్రభుత్వం వెంటనే చెల్లించనుంది.

నమో.. నమో.. నారసింహాయ

అద్దంకి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ నరసింహస్వామి క్షేత్రంలో గురువారం స్వామివారి జయంతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారికి స్థాపన, విశేషాలంకరణ, లక్ష మల్లెలతో అర్చన, కల్యాణం నిర్వహించారు. బాలబాలికలచే కోలాటం ప్రదర్శించారు. ఆలయ ఈవో కోటిరెడ్డి మాట్లాడుతూ గురు, శుక్రవారాల్లో దేవస్థానంలో ఏకాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థాన ఈవో, ఆలయ ధర్మకర్త ఎస్.ఏడుకొండలు పర్యవేక్షించారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరెరే.. ఎంత పని జరిగింది!

కొమరోలు: హైవేపై వెళ్తున్న ఓ లారీ ఉన్నట్టుండి ఆగిపోయింది. అంతా చూస్తుండగానే టైరు ఊడి పక్కన పడింది. ఈ సంఘటన అమరావతి–కడప రాష్ట్రీయ రహదారిపై కొమరోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వైఎస్సార్ జిల్లా పులివెందుల నుంచి గుంటూరుకు పత్తి లోడుతో వెళ్తున్న లారీ ఇరుసు విరగడంతో టైరు ఊడింది. నడిరోడ్డుపై లారీ ఆగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

